సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 17 । జూలై । 2024



పాత కక్షలే.. ప్రాణం తీశాయి

పాత కక్షలతోనే బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్ దేవేందర్‌ను ప్రత్యర్థులు హత్యచేశారని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు.

- 8లో▸



అంతర్ జిల్లా బైక్ దొంగల అరెస్ట్

ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను మడికొండ పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నీలా, నిత్యాక్రమంలో భద్రకాళి





హన్మకొండ కల్చరల్ : వరంగల్ శ్రీభద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా పదకొండో రోజు మంగళవారం అమ్మవారికి నీలా, నిత్యా క్రమాల్లోన పూజలు నిర్వహించారు. అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ నిత్యాహ్నికం చతుష్టానార్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి స్నపనమూర్తిని కాళీక్రమమైన నీలా అమ్మవారిగా, అమ్మవారి భోగబేరాన్ని షోడశీక్రమంలో నిత్యా అమ్మవారిగా అలంకరించి పూజలు జరిపారు. ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.

ఏసీ సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలి

హన్మకొండ: వరంగల్ ప్రాంత ప్రజలు ఆర్టీసీ ఏసీ బస్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వరంగల్ బస్‌స్టేషన్ నుంచి హైదరాబాద్‌కు ప్రతీరోజు ఉదయం 6 గంటలకు, 7, 8 గంటలకు రాజధాని ఏసీ బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈబస్సులకు కాశిబుగ్గ, పోచమ్మ మైదాన్, ఎంజీఎం, ములుగు రోడ్డు స్టేజీల్లో స్టాప్‌లు ఉంటాయని, ప్రయాణికులు ఎక్కవచ్చని వివరించారు. ఇక్కడి నుంచి హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌కు చేరుకుని హైదరాబాద్‌కు బయలుదేరుతుందని తెలిపారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



ఎంజీఎం: నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లలో రాష్ట్ర మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ జమునాదేవి, డాక్టర్ బిందు శ్రీ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నియంత్రణ చట్టం నియమాలను పాటిస్తున్న తీరు, అనుమతి పత్రాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను వారు తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలు చట్టరీత్యా నిషేధమని, ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికల నిష్పత్తి తగ్గుతున్న నేపథ్యంలో.. ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో వెల్లడైన అంశాలను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. రిఫర్‌ల స్లిప్‌లోని పూర్తి వివరాలను నింపి ఫామ్-ఎఫ్‌తో పాటు భద్రపర్చాలని నిర్వాహకులకు సూచించారు.

సుప్రసిద్ధ ఉర్దూ కవి తాజ్ ముష్తర్ కన్నుమూత



హన్మకొండ కల్చరల్ : సుప్రసిద్ధ ఉర్దూ కవి, బజ్మే-ఎ-షాద్ వ్యవస్థాపకుడు, కాళోజీ రామేశ్వరరావు షాద్ స్మారక పురస్కార అవార్డు గ్రహీత తాజ్ ముష్తర్ (86)సోమవారం రాత్రి హైదరాబాద్‌లో కన్నుమూశారు. వరంగల్ పాపయ్యపేట చమన్‌కు చెందిన ముష్తర్ పోలీస్ శాఖలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. కాళోజీ సోదరులకు అత్యంత సన్నిహితులు. ఆదర్శభావాలు కలిగి కులమతాలకు అతీతంగా కవిత్వాన్ని సృజించిన కవి ముష్తర్ దాదాపు ఏడు కవితా సంపుటాలను ఉర్దూలో ప్రచురించారు. ఆయన మరణం సాహితీలోకానికి తీరని లోటని జిల్లాకు చెందిన సాహితీవేత్తలు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వీరిలో అంపశయ్య నవీన్, పొట్లపల్లి శ్రీనివాసరావు, వీఆర్ విద్యార్థి, నాగిళ్ల రామశాస్త్రి, అనిశెట్టి రజిత, కొమర్రాజు రామలక్ష్మి , పందిళ్ల అశోక్‌కుమార్, సిరాజుద్దీన్, ఆచార్య బన్న అయిలయ్య, ఆగపాటి రాజ్‌కుమార్, బిల్ల మహేందర్, బాలబోయిన రమాదేవి, గట్టు రాధిక, హాజీనూరాణీ ఉన్నారు.

బీఈడీ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వాసంతి

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాల, డైట్ కళాశాలలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా డీఈఓ వాసంతిని నియమించారు. ఈమేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వర్తించిన ఎండీ అబ్దుల్‌హై సెలవులపై వెళ్లిన విషయం తెలిసిందే. ప్రభుత్వ డైట్ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిసూ యాదాద్రి డీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నారాయణరెడ్డి కూడా బదిలీపై వెళ్లారని సమాచారం. దీంతో ఆ రెండు కళాశాలలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వాసంతికి బాధ్యతలు అప్పగించారు.

సగం దాటని లక్ష్యం!

'గ్రేటర్'లో పచ్చదనం.. పరిహాసమేనా?

- 15 లక్షల మొక్కలు నాటాలని ప్రణాళిక
- ఉన్నవి 5 లక్షలు..కొనేవి 6 లక్షలట!
- మధ్యలోనే చేతులెత్తేసిన యంత్రాంగం
- ఆదిలోనే లక్ష్యానికి దూరం.. పచ్చదనంపై శ్రద్ధ కరువు
- బల్దియా పాలకులు, అధికారుల తీరుపై విమర్శలు

'వన మహోత్సవం' ప్రణాళిక బ్రహ్మండంగా ఉంది. ఆచరణ మాత్రం అధమ స్థాయిలో ఉంది. ప్రణాళిక ప్రకారం.. వరంగల్ మహా నగర పరిధిలో 15 లక్షల మొక్కలు నాటాలి. ఇందుకోసం ప్రభుత్వం రూ.22.73 కోట్లు కేటాయించింది. వర్షాకాలం మొదలైనప్పటికీ సగం కూడా లక్ష్యం చేరుకోలేదు. మొక్కలు ఎక్కడ నాటుతారు? వాటిని ఎవరు సంరక్షిస్తారు? నగరంలో వన మహోత్సవం ఎంతమేర సక్సెస్ అవుతుందనేది అంతు చిక్కని ప్రశ్న!



హరితహారం కోసం భట్టుపల్లిలో సిద్ధంగా ఉన్న మొక్కలు

వరంగల్ అర్బన్: బీఆర్ఎస్ ప్రభుత్వం హరిత హారం పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. అదే కార్యక్రమానికి వన మహోత్సవంగా పేరు మార్చింది ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని నగరాలకు, పట్టణాలకు టార్గెట్లను విధించింది. గ్రేటర్ వరంగల్ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 15 లక్షల మొక్కలు నాటాలని ప్రణాళికలు రూపొందించింది. కానీ అందులో సగం కూడా నాటకుండానే అధికార యంత్రాంగం చేతులెత్తేసింది. నాటిన మొక్కల్లో కేవలం 10 శాతం మొక్కలు మాత్రమే మిగిలాయి.

ప్రణాళిక 11 లక్షలు.. ఉన్నవి రూ.5 లక్షలే

2024-25 ఆర్థిక సంవత్సరానికి వాస్తవాలకు దగ్గరగా ప్రణాళికలు వేస్తున్నట్లు ప్రకటించిన బల్దియా అధికార యంత్రాంగం 11 లక్షల మొక్కలు లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ప్రణాళికలు అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. నగరంలోని నర్సరీల్లో 5 లక్షల మొక్కలు మాత్రమే నాటేందుకు, పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. హైదరాబాద్ హెచ్ఎండీఏ నుంచి 3.50 లక్షల మొక్కలు వస్తాయని అధికారులు చెప్పడం విస్మయానికి గురిచేస్తోంది. మరో 2.50 లక్షల మొక్కలు కొనుగోలు చేసేందుకు టెండర్లు పిలుస్తున్నట్లు ప్రకటించిన అధికారులపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రీన్ బడ్జెట్‌కు రూ.23.73 కోట్లు

తెలంగాణ ప్రభుత్వం వన మహోత్సవంలో భాగంగా నగరాలు, పట్టణాలను పర్యావరణహితంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణల్ని రూపొందించి టార్గెట్ విధిస్తూ మొక్కలు నాటిస్తోంది. అంతేకాకుండా 2019-చట్టాన్ని అనుసరించి గ్రీన్ బడ్జెట్(హరితనిధి) కేటాయిస్తోంది. అందుకోసం అధికార యంత్రాంగం వ్యాపార, వాణిజ్య వర్గాల ట్రేడ్ లైసెన్స్‌తోపాటు ఏడాదికి రూ.వెయ్యి అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం కోసం ప్రభుత్వం 'గ్రేటర్'కు రూ.23.73 కోట్లు కేటాయించింది. మొక్కలు నాటడం, వాటి సంరక్షణ, కంచెలు, పార్కులు, డివైడర్ల పచ్చదనం కోసం నిధులు వెచ్చిస్తోంది. నగరంలో అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. 2020-22 సంవత్సరాల్లో రూ.20 కోట్ల నిధులతో నగరంలోని పలు డివిజన్లలో గుంతలు చేసే యంత్రాలతో మొక్కలు నాటినట్లు చెబుతున్నారు. 2018-22 వరకు గడిచిన ఐదేళ్లలో 44 లక్షల మొక్కలు నాటినట్లు లెక్కలు చూపిస్తున్నారు. ఇకపోతే గతేడాది 2023-24లో 15 లక్షలు నాటినట్లు పేర్కొంటున్నారు. ప్రతీ ఏడాది ఇవే లెక్కలు, రికార్డులు చూపిస్తూ మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మొక్కల పెంపకం, రవాణా, గుంతలు తీయడం, మొక్కలు నాటడం, సంరక్షణలో పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

8 నర్సరీల్లో సిద్ధంగా మొక్కలు

నగరంలో వన మహోత్సవ కార్యక్రమం ప్రారంభమైంది. తాజాగా వరంగల్ ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఈఏడాది 11 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రచించారు. వరంగల్ జిల్లాలోని కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో 5 లక్షలు, హనుమకొండ జిల్లాలోని కాజీపేట సర్కిల్ పరిధిలో 6 లక్షలు మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. గ్రేటర్ వరంగల్ ఆధ్వర్యంలో 8 నర్సరీలున్నాయి. బల్దియా ఆధ్వర్యంలో 5 లక్షల మొక్కలు మాత్రమే సిద్ధంగా ఉన్నాయి. హనుమకొండ ప్రాంతంలోని ఎల్లాపూర్, మడికొండ శివారు, సూర్య కుటీర్ వెంచర్, కాజీపేట, బాలసముద్రం, నక్కలగుట్ట, వరంగల్ ప్రాంతంలోని క్రిస్టియన్ కాలనీలో రెండు నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నా యి. బల్దియా అధికారులు మాత్రం టార్గెట్‌లో ఇప్పటికే 3.94 లక్షల మొక్కలు నాటినట్లు వెల్లడిస్తున్నారు. సెంట్రల్ మీడియం, రహదారులు, ఇతర ప్రదేశాల్లో మొక్కలు నాటినట్లు పేర్కొంటుండడంపై అనేక విమర్శలు వస్తున్నాయి.

నర్సరీల ద్వారా పంపిణీ..

> వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాం. నగరంలోని 8 నర్సరీల్లో 58 రకాల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. నగర పౌరులు నర్సరీల నుంచి మొక్కలు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేశాం. ఇంటింటా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే డివైడర్లు, రోడ్ సైడ్ మొక్కల్ని పెద్ద ఎత్తున నాటుతున్నాం. హెచ్ఎండీఏ నుంచి 5 లక్షలు మొక్కలు రానున్నాయి. మరో 2.50 లక్షల మొక్కలను ప్రైవేట్ నర్సరీల ద్వారా కొనుగోలు చేసేందుకు నిర్ణయించాం.
>
> - రమేశ్, బల్దియా ముఖ్య ఉద్యానవన అధికారి

కొనసాగుతున్న బదిలీల కౌన్సెలింగ్



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

హన్మకొండ అర్బన్: జిల్లాలో సుమారు 18 ప్రభుత్వ శాఖలకు సంబంధించి జిల్లా స్థాయి ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ కలెక్టరేట్‌లో కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం బదిలీలపై నిషేధం సడలించిన నేపథ్యంలో.. జిల్లాలో బదిలీల ప్రక్రియ ప్రారంభించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవీ.గణేశ్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డీపీఓ లక్ష్మీరమాకాంతం, ఇతర ఉన్నతాధికారులు ఆయా శాఖల ఉద్యోగులకు కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 786 మంది ఉద్యోగులకు బదిలీలు చేపట్టాల్సి ఉండగా.. మంగళవారం బదిలీ ప్రక్రియ ముగిసింది. ఇదే ప్రక్రియ గురువారం కూడా కొనసాగనుంది. బదిలీలకు చిన్న పిల్లలతో తల్లులు హాజరుకావడం, గంటల తరబడి వేచి ఉండి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆఫీస్ బేరర్ల కోసం టీఎన్జీఓస్ పట్టు

జిల్లా పంచాయతీ శాఖలో బదిలీల ప్రక్రియ సందర్భంగా బదిలీలు చేస్తున్న క్రమంలో డీపీఓ తీరును టీఎన్జీఓస్ జిల్లా నాయకులు ఆకుల రాజేందర్, కార్యదర్శి బైరి సోమయ్య, కోశాధికారి రాజేశ్, అసోసియేట్ కార్యదర్శి పుల్లూరి వేణు తప్పుపట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు బదిలీల నుంచి మినహాయింపు ఉన్నప్పటికీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడంపై నిరసన వ్యక్తం చేశారు. అధికారుల తీరు ఇలాగే కొనసాగితే తాము ఊరుకోమని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఆఫీస్ బేరర్స్‌కు మినహాయింపు ఇవ్వాలన్నారు. సమస్యను పరిశీలించిన అదనపు కలెక్టర్, డీఆర్ఓలు ఉద్యోగ సంఘాల అభ్యర్థనను మన్నించాలని సూచించడంతో వివాదం సద్దుమణిగింది. బదిలీ ప్రక్రియలో కలెక్టరేట్ ఏఓ సత్యనారాయణ, సూపరింటెండెంట్లు సంతోశ్‌కుమార్, శ్యాం, ఇర్ఫాన్, సోమేశ్, తదితరులు ఉన్నారు.

వైద్యుల కోసం పడిగాపులు



వైద్యుల కోసం నిరీక్షిస్తూ క్యూలైన్‌లో కూర్చున్న రోగులు

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో దుస్థితి

ఎంజీఎం: ఎప్పుడైనా వస్తారు. ఎప్పుడైనా వెళ్లిపోతారు. సమయపాలన విషయంలో సూపర్ స్పెషాలిటీ వైద్యుల తీరే వేరు. ఇక్కడ సాధారణంగా ఉదయం 8 గంటల నుంచి ఔట్ పేషెంట్లకు చిట్టీలు ఇస్తారు. కానీ మంగళవారం ఉదయం 10 గంటలు దాటినా.. ఓపీ సేవలు ప్రారంభం కాలేదు. దీంతో వైద్య సేవల కోసం వచ్చిన రోగులు ఓపీ చిట్టీలు చేతిలో పట్టుకొని డాక్టర్ల గదుల ఎదుట క్యూలో నిల్చునే ఓపిక లేక కింద కూర్చుండిపోయి కనిపించారు. కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని చెబుతున్న వైద్యాధికారులు వైద్యుల సమయపాలనపై దృష్టిపెట్టకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రైవేట్ హాస్పిటళ్లకు వెళ్లే స్తోమత లేక సుదూర ప్రాంతాల నుంచి పేదలు ఈ హాస్పిటల్‌కు వస్తుంటారు. దీంతో రోజురోజుకూ రద్దీ పెరుగుతూ వస్తోంది. అధికారుల నిర్లక్ష్యం వారిని ఇబ్బందులు పెడుతోంది. సూపర్ హాస్పిటల్‌లో న్యూరాలజీ, న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, పిడియాట్రిక్ సర్జరీ విభాగాల ఓపీ సేవలు కొనసాగాల్సి ఉన్నా.. వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో సేవలు ప్రారంభం కాలేదు. దీంతో రోగులు గంటల తరబడి నిలబడే ఓపిక లేక క్యూలైన్‌లో కూలబడుతున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బొగత.. ఫిదా

సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం కనువిందు చేస్తోంది. మంగళవారం కొద్దిమంది పర్యాటకులు వచ్చి నప్పటికీ జలపాతం అందాలకు ఫిదా అయ్యారు. పాలనురగలా జాలువారుతున్న నీటి పరవళ్లతో నిండుగా కనిపిస్తుండడంతో వీక్షకులు ఫొటోలు తీసుకున్నారు. - వాజేడు

రుణమాఫీపై.. సంతోషం.. సందేహం!

- హనుమకొండ జిల్లాలో 1.51 లక్షల మంది రైతులు
- 50వేల మంది కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధిదారులు
- 2.65 లక్షల మంది తెల్ల రేషన్‌కార్డుదారులు
- ఆందోళన కలిగిస్తున్న సర్కారు నిబంధనలు



హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల మేర రుణమాఫీ చేయడానికి తీసుకున్న నిర్ణయం ఒక వైపు రైతుల్లో సంతోషం నింపుతుండగా, రేషన్ కార్డు, ఇతరత్రా నిబంధనలతో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు తీసుకున్న రూ.2 లక్షల లోపు రుణాన్ని మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. మరో వైపు ప్రభుత్వం విధించిన ఆంక్షలు కొంత మంది రైతుల్లో ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండాలని, పట్టాదారు పాసుపుస్తకం ఉంటే సరిపోతుందని మరోసారి చెబుతుండడంతో రైతులు గందరగోళానికి గురవుతున్నారు. వడ్డీతో కలుపుకుని రూ.2 లక్షల వరకు మాత్రమే రుణ మాఫీ చేయనున్నట్లు, ఆ పై మొత్తాన్ని రైతులు చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందని ప్రచారం జరుగుతుండడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. హనుమకొండ జిల్లాలో తెల్ల రేషన్‌కార్డులు కలిగిన లబ్ధిదారులు దాదాపుగా 2.65 లక్షల మంది ఉండగా, రైతులు 1.51 లక్షల మంది ఉన్నారు. జిల్లాలో 50 వేల మంది ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి సహాయాన్ని అందుకుంటున్నారు. వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రూ.2 లక్షల్లోపు రుణాలు 78,432 మంది రూ.529.44 కోట్లు తీసుకున్నారు. ప్రభుత్వం విధించిన నిబంధనలను చూస్తే ఇందులో అర్హుల సంఖ్య తగ్గే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. వాణిజ్య బ్యాంకుల్లో రూ.2 లక్షల్లోపు రుణాలు తీసుకున్న వారి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. రుణమాఫీ నిబంధనలను చూస్తే రూ.2 లక్షల్లోపు రుణాలు తీసుకున్న వారందరికీ మాఫీ అవుతుందా.. కాదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు అర్హులను గుర్తించాల్సి ఉంది. రెండు మూడు రోజులైతే జిల్లాలో ఎంతమంది అర్హులు, ఎంత మొత్తం మాఫీ జరుగుతుందో స్పష్టం కానుంది.







సీఎం సమావేశంలో కలెక్టర్లు

హైదరాబాద్‌లో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితో జరిగిన సమావేశంలో పాల్గొన్న వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్య, సీపీ అంబర్‌కిషోర్ ఝా.

ఇక 'అడ్జెస్ట్‌మెంట్' ప్రక్రియ!

ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత

- విద్యాబోధనలో ఆటంకం
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు



విద్యారణ్యపురి: టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ తర్వాత వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడింది. ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ రేషనలైజేషన్ నిబంధన చూపి కొంతమందిని రిలీవ్ చేయలేదు. టీచర్ల కొరత కారణంగా విద్యాబోధన సరిగ్గా జరగక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు జిల్లాలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ టీచర్లు సరిపడాలేరు. మరికొన్నిచోట్ల విద్యార్థులు తక్కువగా ఉన్నప్పటికీ టీచర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. హెచ్ఎంలు ఈవిషయాన్ని ఇప్పటికే డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వర్కింగ్ అడ్జెస్ట్‌మెంట్‌పై అధికారులు దృష్టిసారించారు. కాగా.. హనుమకొండ జిల్లాలో 304 పీఎస్‌లు, 70 యూపీఎస్‌లు, 128 హైస్కూళ్లు ఉన్నాయి.

కొన్ని పాఠశాలల్లో టీచర్ల కొరత ఇలా..

- జిల్లాలోనే అత్యధికంగా హనుమకొండ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో 402 మంది విద్యార్థులున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 15 మంది టీచర్లు అవసరం ఉండగా.. ప్రస్తుతం హెచ్ఎంతోకలిపి ఏడుగురు పని చేస్తున్నారు. కనీసం ఇంకా ఐదుగురు టీచర్లను నియమించాలని హెచ్ఎం ప్రతిపాదించారు.
- హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్ 698 మంది విద్యార్థులున్నారు. పోస్టుల సంఖ్య 31 ఉంటే హెచ్ఎంతో సహా 23 మంది పని చేస్తున్నారు. హిందీలో ఇద్దరు ఎస్ఏలు, ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టుల ఎస్ఏ టీచర్ల కొరతతో పాటు ఒక ఎస్జీటీ కొరత ఉంది. క్రాఫ్ట్ టీచర్ పోస్టులు నాలుగు ఉండగా.. ఒకరు పని చేస్తున్నారు. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- సుబేదారి ప్రభుత్వ హైస్కూల్‌లో 320 మంది విద్యార్థులున్నారు. 21 మంది టీ చర్లకుగాను 18 మంది పని చేస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది.
- హనుమకొండలోని లష్కర్‌బజార్ బాలికల ప్రభుత్వ హైస్కూల్‌లో 18 టీచర్ పోస్టులు ఉండగా.. 15 మంది ఉన్నారు. ఫిజికల్ సైన్స్, హిందీ, డ్రాయింగ్ మాస్టర్ టీచర్ల అవసరం ఉంది.
- హనుమకొండ జులైవాడలోని కో-ఎడ్యుకేషన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు 450 మంది విద్యార్థులున్నారు. ఆరుగురు ఎస్జీటీలు, నలుగురు స్కూల్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. ప్రధానంగా మ్యాథ్స్, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ల కొరత ఉంది. ఇలా ఇంకా అనేక పాఠశాలల్లోనూ సమస్య ఇదే.

వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌పై దృష్టి

జిల్లాలోని పాఠశాలల్లో టీచర్లు అధికంగా ఉన్న, తక్కువగా ఉన్న పాఠశాలల్లో రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం.. వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియ నిర్వహించేందుకు డీఈఓ వాసంతి ఉపక్రమించారు. ఈమేరకు మూడ్రోజుల క్రితం ఎంఈఓలతో, మండల నోడల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. అందుకు అనుగుణంగా ఎంఈఓలు ఉపక్రమించినట్లు సమాచారం. కాగా.. వివిధ మండలాల్లో పలువురు టీచర్లు తమను వేరే చోటికి పంపొద్దని ఎంఈఓలపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో ఈప్రక్రియ పూర్తవడానికి జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో టీచర్ పోస్టుల వేకెన్సీల్లో త్వరలో జరగబోయే డీఎస్సీ ద్వారా నియమించనున్నట్లు సమాచారం.

ముంపుపై అప్రమత్తంగా ఉండాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: వర్షాలు కురుస్తున్న క్రమంలో వరద నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ పరిధి జూ పార్కు వెనుక వైపు ఉన్న ప్రాంతం, అంబేడ్కర్ భవన్, ప్రెసిడెన్సీ స్కూల్, సాయి నగర్ కాలనీ, నయీంనగర్ బ్రిడ్జి, అలంకార్ జంక్షన్, అజర హాస్పిటల్ ప్రాంతంలో ఇటీవల నూతనంగా నిర్మితమైన బ్రిడ్జి, పోతననగర్ 12 వెంట్స్ ప్రాంతంతో పాటు వరంగల్ పరిధి బట్టల బజార్, వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంతం, గోపాలస్వామి గుడి ఏరియాలో కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించేందుకు సూచించారు. ఈసందర్భంగా అజర హాస్పిటల్ ప్రాంతంలో ఇటీవల నిర్మించిన బ్రిడ్జి ప్రాంతంలో నాలాకు అనుకొని ప్రమాదకరంగా ఉన్న వృక్షాన్ని తొలగించాలని డీఎఫ్ఓను ఆదేశించారు.

బోనాల పండుగకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: మహా నగర వ్యాప్తంగా జరిగే పోచమ్మ బోనాల పండుగకు విస్తృత ఏర్పాట్లు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగ ఉన్నతాధికారులతో త్వరలో జరగనున్న బోనాలు, బీరన్న ఉత్సవాల నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా నగరంలోని అన్ని ఆలయాలకు లైటింగ్ ఏర్పాట్లు, అంతర్గత రహదారులకు డస్టింగ్ వేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు, సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉంటూ.. బల్దియావ్యాప్తంగా రహదారులపై ఏర్పడే గుంతలు పూడ్చాలన్నారు. మ్యాన్ హోల్‌పై కవర్ ఉండేట్లు చూడాలని ఆదేశించారు. వరద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు కృష్ణారెడ్డి, ప్రవీణ్ చంద్ర, ఈఈలు శ్రీనివాస్‌రావు, సంజయ్‌కుమార్, డీఈలు సీఎంహెచ్ఓ రాజేశ్, ఈఈలు బీఎల్.శ్రీనివాస్, శ్రీనివాస్, సంజయ్‌కుమార్, డీఈలు రవికిరణ్, సంతోశ్‌బాబు, రంగారావు, శివానంద్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం తనిఖీ

ప్రజాపాలన కార్యక్రమంపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మేయర్ సుధారాణి ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వీకరించిన దరఖాస్తుల్ని తనిఖీ చేసి నమోదు చేసిన వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా బల్దియా ప్రధాన కార్యాలయంలోని రెవెన్యూ, జనన, మరణ, ప్రజారోగ్య, పరిపాలన, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక తదితర విభాగాలను సందర్శించి సిబ్బంది హాజరును పరిశీలించారు. ఆమె వెంట సీఎంహెచ్ఓ రాజేశ్, సెక్రటరీ విజయలక్ష్మి, ఎస్ఈ కృష్ణారావు, పీఆర్ఓ ఆయూబ్ అలీ, పర్యవేక్షకులు ఆనంద్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న రామ్‌ప్రకాశ్

ఖిలా వరంగల్: వరంగల్ పోలీస్ నాలుగో బెటాలియన్ కమాండెంట్‌గా బి.రామ్‌ప్రకాశ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జ్ కమాండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించిన డి.శివప్రసాద్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శతకొండ కమాండెంట్‌గా వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన కమాండెంట్‌ను ఏసీ కృష్ణప్రసాద్, శ్రీనివాస్, ఏఓ నిర్మల, డాక్టర్ అన్వేషణి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శోభన్, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజిరెడ్డి, రమేశ్, ఏవీఎస్‌రెడ్డి,రాజ్‌కుమార్, కిరణ్, అశోక్, కృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ఇంత కాలం ఇక్కడ పనిచేసిన శివప్రసాద్‌రెడ్డికు ఘన వీడ్కోలు పలకగా.. రామ్‌ప్రసాద్‌ను ఘనంగా స్వాగతించారు. ఈకార్యక్రమంలో స్పెషల్ పోలీసులు పాల్గొన్నారు.

టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి బదిలీలు

విద్యారణ్యపురి : రాష్ట్రంలోని ఇంటర్, ఉన్నత విద్య, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్య(పాలిటెక్నిక్)లోను టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగుల బదిలీలకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం సోమవారం రాత్రి మార్గదర్శకాలు జారీ చేశారు. ఈనెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఈ బదిలీల ప్రక్రియ పూర్తి చేయబోతున్నారు. ఒకే చోట ఐదేళ్లు పని చేసిన వారు తప్పని సరిగా బదిలీలకు దరఖాస్తులు చేసుకోవాలి. ఈ ఏడాది జూన్ 30 నాటికి ఒకే చోట రెండేళ్ల సర్వీస్ నిర్వర్తించిన వారు కూడా బదిలీలకు దరఖాస్తులు చేసుకునే వీలుంది. అలాగే రెండేళ్లలోపు ఉద్యోగ విరమణ పొందబోతున్న వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. కావాలంటే దరఖాస్తు చేసుకునే వీలు కూడా ఉంది. స్పౌజ్ కేటగిరీలో భార్యభర్తకు ఎవరో ఒకరే వినియోగించుకోవాల్సింటుంది. దివ్యాంగ ఎంప్లాయిస్, ఒంటరి మహిళలకు, వితంతువు, విడాకులు పొందిన మహిళలకు కూడా పాయింట్లు ఉంటాయి. న్యూరో సర్జరీ, క్యాన్సర్, కిడ్నీ, లివర్, ఓపన్ హార్ట్ సర్జరీ, ట్రాన్స్‌ప్లాంటేషన్, బోన్ టీబీతో బాధపడుతున్న ఉద్యోగులకు కూడా పాయింట్లు ఉంటాయి. వెబ్ కౌన్సిలింగ్ ద్వారానే బదిలీల ప్రక్రియ నిర్వహిస్తారు. గతంలో కళాశాలల అధ్యాపకుల సంఘ రాష్ట్ర, జిల్లాల నాయకులకు బదిలీ నుంచి మినహాయింపు ఉండేది, ఈసారి బదిలీల్లో వారికి మినహాయింపు లేదు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఇంటర్ విద్యలో 45కు పైనే ప్రభుత్వ జూనియర్ కళాశాలున్నాయి. ఇందులో 80మంది వరకు రెగ్యులర్ లెక్చరర్లు పని చేస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు 14 ఉండగా సుమారు 250 మందికి పైగా అధ్యాపకులు ఉంటారని భావిస్తున్నారు. ఆయా కళాశాలల్లోని ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బందికి ఆరేళ్లుగా బదిలీలు లేవు.

వ్యవసాయ రంగాల అభివృద్ధే లక్ష్యం

మామునూరు: వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల అభివృద్ధే పరిశోధన స్థానం లక్ష్యమని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న అన్నారు. ఈమేరకు మంగళవారం ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి 96వ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాల ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ ప్రథమ స్థానంలో, చేపల పెంపకంలో రెండో స్థానంలో ఉందన్నారు. వ్యవసాయ రంగం, ఉద్యాన పంటల్లో గణనీయమైన ప్రగతి సాధించామని వివరించారు. శాస్త్రవేత్తలు రాజు, శశాంక్, సాయి కిరణ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

'తొలిఏకాదశి'.. సర్వశ్రేష్టం


కొడవటూరు సిద్ధులగుట్ట


బీరప్ప కామరతి, మహంకాళి దేవతామూర్తులు


బీరప్ప ఆలయం

నేడు పర్వదినం ప్రారంభం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- చాతుర్మాస వ్రతాలు షురూ
- ముస్తాబవుతున్న శివ, విష్ణు ఆలయాలు
- పండుగలకు స్వాగతం

జనగామ: శివకేశవులు, విష్ణువుకు ప్రీతికరమైన రోజు.. ఉపవాసాలు, వ్రతాలు ప్రారంభమయ్యే శుభదినం.. పండుగలకు స్వాగతం పలికే రోజు 'తొలి ఏకాదశి'. ఆషాఢ మాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశిని 'తొలిఏకాదశి' అంటారు. దీనినే 'శయన ఏకాదశి' అని కూడా పిలుస్తారు. ఉత్తర దిక్కున ఉన్న సూర్యుడు ఈరోజు నుంచి దక్షిణ దిక్కున ప్రయాణించడం వల్ల దీనిని దక్షిణాయణంగా పరిగణిస్తారు. అందుకే శివకేశవులు.. విష్ణువుకు ఈరోజు ప్రీతికరమైనదిగా భావిస్తారు. నేటి బుధవారం తొలిఏకాదశి సందర్భంగా శివ, వైష్ణవాలయాలను ముస్తాబు చేస్తున్నారు. ఆదిశేషుడి వాహనం కలిగిన నారాయణుడిని లక్ష్మి సమేతంగా పూజ చేయడం వల్ల సకల శ్రేయస్సు కలుగుతుంది. ఈరోజు ఉపవాసాలు, శివనామస్మరణ, విష్ణు సహస్రనామ పారాయణం చేయడం సర్వశ్రేష్టం. తొలిఏకాదశి రోజున విష్ణు నామస్మరణ చేసే వారికి వైకుంఠ ప్రాప్తి కూడా కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు విష్ణువు యోగ నిద్రలో ఉంటాడు. చాతుర్మాస్యం ఈరోజు నుంచే మొదలవుతుంది. అందుకే ఈ నాలుగు మాసాలు ధర్మాచరణ కలిగి విష్ణు ప్రీతికై వ్రతాలు చేయడం నారాయణ అనుగ్రహం కలుగుతుందని భక్తుల విశ్వాసం. నాలుగు మాసాల్లో వచ్చే ఏకాదశులకు ఇది మొదటిది కావడంతో 'తొలిఏకాదశి' అని పిలుస్తారు. తొలిఏకాదశి రోజున నదీ స్నానం పవిత్రమైనదిగా భావిస్తారు.

మూడు రోజుల పాటు వ్రతం..

ఈ ఏకాదశి వ్రతం మూడు రోజులు చేయాలి. రోజు శేషశాయిని అర్చించడం, ఏకాదశి పర్వదినం రోజున ఉపవాసం, ద్వాదశి పారాయణం, త్రయోదశి రోజున గీత నృత్యాదులతో అర్చన చేయాలి. చాతుర్మాస్య వ్రతం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ వ్రతం చేయాలనుకునే భక్తులు మొదటి రోజు నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నాలుగు నెలల పాటు నిష్టతో స్వామికి పూజలు చేయాల్సి ఉంటుంది. పరమాత్ముడికి బెల్లం, తైలం, విడిచి పెడతామని సంకల్పించుకోవాలి. దేవుడికి నివేదన చేయని ఆహారం, పుచ్చకాయ, కాల్చి వండినవి, గుమ్మడికాయ, చెరకు, కొత్త ఉసిరిక, చింతపండు, మంచంపై పడుకోవడం, పరాన్నం, తేనె, పొట్లకాయ, ఉలవలు, తెల్ల ఆవాలు, మినుములు ఈ నాలుగు నెలల పాటు వినియోగించకుండా నిష్టతో భగవంతుడి సేవలో నిమగ్నం కావాలి. చాతుర్మాస్య వ్రతాలు, పూజలు చేసిన భక్తులకు దేవతల ఆశీస్సులు దక్కుతాయని భక్తుల విశ్వాసం.

ముస్తాబవుతున్న ఆలయాలు

తొలి ఏకాదశి సందర్భంగా జనగామ జిల్లాలోని పాలకుర్తి శ్రీ సోమేశ్వరాలయం, బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్ధేశ్వరాలయం, జనగామ బాణాపురం శ్రీవెంకటేశ్వరాలయం, పాతబీటు శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీసంతోషిమాత ఆలయం, చిల్పూరు శ్రీ వెంకటేశ్వరాలయాలను సుందరంగా అలంకరిస్తున్నారు. తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచి ఆలయాలకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు.

నేడు కురుమ కులస్తుల బోనాలు

తొలి ఏకాదశి సందర్భంగా నేడు జనగామ పట్టణంలో కురుమ కులస్తులు బీరప్ప కామరతి, అక్క మహంకాళి దేవతామూర్తులకు బోనాలు సమర్పించనున్నారు. కుర్మవాడ నుంచి నెహ్రూపార్కు మీదుగా ఒగ్గుడోలు కళాకారుల వాయిద్యాలు.. శివసత్తుల నృత్యాలు.. పోతరాజుల విన్యాసాల మధ్య వేలాది మంది మహిళలు బోనాలతో పాటు పట్టువస్త్రాలతో బీరప్ప ఆలయానికి చేరుకుంటారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, బోనం నైవేద్యం సమర్పించిన అనంతరం, పట్టువస్త్రాలు కానుకగా ఇచ్చి ఒడిబియ్యం పోస్తారు. ఇందుకు సంబంధించి ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తుండగా, పోలీసులు కట్టుదిట్ట చర్యలు చేపడుతున్నారు.

ఆధ్యాత్మికం

మొహర్రం.. వీరత్వానికి ప్రతీక

నేడు మధ్యకోటలో వేడుకలు
- సాయంత్రం 5గంటలకు భారీ ఊరేగింపు
- 200 ఏళ్ల చరిత్ర గల మధ్యకోట పీరీలు
- పీరీల బావి, చావడీల్లో ముమ్మర ఏర్పాట్లు
- మతాలకతీతంగా పీరీలను దర్శించుకోనున్న భక్తులు


పీరీలను నిమజ్జనానికి తరలిస్తున్న ముస్లింలు (ఫైల్)

ఖిలా వరంగల్: మొహర్రం.. వీర మరణానికి ప్రతీక. ధర్మ రక్షణ కోసం కర్బలా మైదానంలో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన వారికి గుర్తుగా మొహర్రం ఉత్సవాలు పీరీలను (సంతాప దినాలు) పది రోజులపాటు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయ రాజధాని ఖిలావరంగల్ కోట పీరీలకు సుమారు 200 ఏళ్ల ఘన చరిత్ర ఉంది . ఏటా పదో రోజు మొహర్రం పీరీల ఊరేగింపుల్లో వేలాది మంది కులమతాలకతీతంగా పాల్గొంటారు. ఈ పీరీలను దర్శిస్తే కష్టాలు తొలగి కోరికలు సిద్ధిస్తాయన్న నమ్మకం. ముస్లింలు తమ ఆరాధ్యదైవంగా భావించే పీరీలను హిందువులు కూడా పూజిస్తారు. మొహర్రం సంతాప దినాల్లో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల ముస్లింలు కూడా ఇక్కడకు చేరుకుని దర్శించుకుంటారు.

మొహర్రం వేడుకలకు సర్వం సిద్ధం..

మధ్యకోట.. బుధవారం జరగనున్న మొహర్రం వేడుకులకు ముస్తాబైంది. ఉదయం 4 గంటల నుంచే పీరీలకు ప్రత్యేక ప్రార్థనలు, సాయంత్రం 5గంటలకు వేలాది ముస్లింల మధ్య భారీ ఊరేగింపు సాగనుంది. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు అధికారులు, ముస్లిం మతపెద్దలు పూర్తి చేశారు. చావడిల్లో నెలకొల్పిన పీరీలకు 200ఏళ్ల ఘన చరిత్ర ఉంది. ఇక్కడి హస్సేన్, హుస్సేన్ పీరీలను దర్శిస్తే కష్టాలు తొలగి కోరికలు సిద్ధిస్తాయన్న నమ్మకం ఉంది. పీరీల ముజవార్ల పర్యవేక్షణ, మొహర్రం కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు పీరీలను దర్శించుకుని ఊరేగింపులో పాల్గొంటారు. ఇప్పటికే పీరీలను రంగుల వస్త్రాలతో అలంకరించారు. తమ కోరికలు తీరిన వాళ్లు పీరీలకు వెండి, బంగారం, గొడుగులు, ఉయ్యాలలు, దట్టీలు సమర్పించనున్నారు.

పీరీల బావి వద్ద ఏర్పాట్లు పూర్తి

మధ్యకోట నుంచి పీరీలు భారీ ఊరేగింపుతో ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ సమీపంలోని కాశికుంట పీరీల బావి వద్దకు రాత్రి 12గంటలలోపు చేరుకుంటాయి. ఇక్కడ ముస్లిం మతపెద్దలు భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేస్తారు. మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. ఈ పనులను స్థానిక కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, పోశాల పద్మ, సిద్ధం రాజు పరిశీలించారు.

భారీ బందోబస్తు ఏర్పాటు



త్యాగానికి ప్రతీకైన మొహర్రం ఊరేగింపునకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తాం. సెంట్రల్‌జోన్ డీసీపీ సలీమా మధ్యకోట పీరీల చావడీలను సందర్శించి ఊరేగింపు కొనసాగనున్న రహదారులను క్షుణ్ణంగా పరిశీలించి భద్రతాపరమైన ఆదేశాలు ఇచ్చారు. డీసీపీ ఆదేశాల ప్రకారం ఊరేగింపు పరిసరాల్లో ఎలాంటి అల్లర్లకు తావులేకుండా చర్యలు తీసుకుంటాం.

-నందిరామ్‌నాయక్, ఏసీపీ వరంగల్

మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలి


వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కాశీబుగ్గ సెంటర్: రైతులు స్వేచ్ఛగా పంటలను అమ్ముకునేందుకు వరంగల్‌లోని లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో అధికారులు సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రైతు సంఘం నాయకులతో కలిసి వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతే రాజు అనే చెప్పే ప్రభుత్వాలు రైతులను ఓట్ల రూపంగానే చూసి ఎన్నికల అనంతరం చేతులు దులుపుకుంటున్నాయని మండిపడ్డారు. వ్యవసాయ ఆధారిత భారతదేశంలో రైతులకు రక్షణ కరువైందని, ఇందుకు ఇటీవల కూరగాయ మార్కెట్‌లో జరిగిన సంఘటనే నిదర్శనమన్నారు. పంటను అమ్ముకుందామనుకుని మార్కెట్‌కు వచ్చే రైతులపై వ్యాపారుల దగ్గర పనిచేసే గుమస్తాలు దురుసుగా ప్రవర్తించడం, దుర్భాషలాడడం, దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. పంటలను అమ్ముకోవడానికి వచ్చే రైతులకు మార్కెట్‌లో రక్షణ లేకుండా పోయిందని, దీనికి మార్కెట్ అధికారుల పర్యవేక్షణ లోపమేనని తెలిపారు. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో రైతులంతా ఐక్యమై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సిరుల రవీందర్, జెండా అంబయ్య పాల్గొన్నారు.

మార్కెట్ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

వరంగల్: వరంగల్, నర్సంపేట, వర్ధన్నపేట, నెక్కొండ వ్యవసాయ మార్కెట్లలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఉద్యోగుల బదిలీల కోసం కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మార్కెట్‌లో సూపర్‌వైజర్ క్యాడర్‌లో పనిచేస్తున్న శివకుమార్, రమణ నర్సంపేట మార్కెట్, వెంకన్ననాయక్ వర్ధన్నపేటకు, వంశీ నెక్కొండకు బదిలీ అయ్యేందుకు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. వారిస్థానంలో చక్రబహద్దూర్‌రాయ్ వర్ధన్నపేట నుంచి, జ్యోతి ప్రకాశ్ నెక్కొండ నుంచి, సలీం నర్సంపేట నుంచి వరంగల్ మార్కెట్‌కు వచ్చేందుకు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. ఏఎంఎస్ క్యాడర్‌లో కన్నయ్య వరంగల్ నుంచి నర్సంపేట మార్కెట్‌కు, జేఎంఎస్ క్యాడర్‌లో రజిత నర్సంపేటకు, ఆమె స్థానంలో శ్రీనివాస్‌రావు వరంగల్‌కు వచ్చేందుకు ఆప్షన్ ఇచ్చారు. వరంగల్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న మైరున్‌బీ నర్సంపేటకు, వాచ్‌ఉమెన్ పద్మ వరంగల్ నుంచి నర్సంపేటకు, వినోద వర్ధన్నపేట నుంచి నెక్కొండకు, వాచ్‌మెన్ మార్త శ్రీనివాస్ వరంగల్ నుంచి వర్ధన్నపేట మార్కెట్‌కు బదిలీ అయ్యేందుకు అంగీకారం తెలిపినట్లు తెలిసింది. ఈమేరకు బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. కాగా, కొత్త జిల్లాల వారీగా బదిలీ చేయడంపై మార్కెట్ ఉద్యోగుల సంఘం స్టేకోసం హైకోర్టును ఆశ్రయించింది. కోర్టు స్టే ఇస్తుందా లేదా అనే విషయం రెండు రోజుల్లో తేలనుందని ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు.

అంతర్ జిల్లా బైక్ దొంగల అరెస్ట్

- రూ. 8 లక్షల విలువైన పది ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మడికొండ సీఐ ప్రతాప్


బైక్‌ల చోరీకి పాల్పడుతున్న వారి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మడికొండ : ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలను మడికొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంగళవారం మడికొండ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ప్రతాప్ వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా జెన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన సంపెంగి రమేశ్ డ్రైవర్ పని చేస్తూ వచ్చిన ఆదాయంతో జల్సా చేసేవాడు. అయితే జల్సాలకు ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనుకున్నాడు. అనుకున్నదే తడువుగా తన స్నేహితుడు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రేలకుంట గ్రామానికి చెందిన వాంకుడోత్ రాకేశ్‌తో కలిసి ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడడం ప్రారంభించారు. ఇందులో భాగంగా జగిత్యాల, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పలుమార్లు ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడగా పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలైన అనంతరం మార్పు రాక పోగా మరోసారి చోరీలకు సిద్ధపడి హైదరాబాద్‌తోపాటు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని మడికొండ, ఇంతేజార్‌గంజ్, పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్రవాహన చోరీలకు పాల్పడ్డారు. ఈ చోరీలపై అప్రమత్తమైన మడికొండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం మడికొండ సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. రమేశ్ వాహనంపై వస్తుండగా అనుమానం కలిగి తనిఖీ చేయగా వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకుని విచారించగా తన నేరాలను అంగీకరించాడు. అనంతరం నిందితుడి సమాచారం మేరకు మరో నిందితుడు రాకేశ్‌ను అదుపులోకి తీసుకుని అతడి ఇంటి వద్ద నుంచి తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రతాప్ తెలిపారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన మడికొండ ఎస్సైలు రాజాబాబు, దివ్య, ఏఎస్సై రమేశ్, ఏఎఓ సల్మాన్ పాషా, హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర, రామ్‌నాథం, జంపయ్య, కానిస్టేబుళ్లు రవి, నాగేశ్వర్, ఐటీ కోర్ కమిటీ సభ్యులు నాగేష్, ప్రవీణ్‌ను సీఐ ప్రతాప్ అభినందించారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్ : అనుమానంతో భార్యను హత్య చేసిన ఘటనలో రాయపర్తి మండలం కొలాన్‌పల్లి గ్రామం జయరాం తండాకు చెందిన నేరస్తుడు లావుడ్యా శ్రీనుకు జీవిత ఖైదు, రూ. 4వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్మలగీతాంబ మంగళవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కథనం ప్రకారం.. కొలాన్‌పల్లి గ్రామం బండకింది తండాకు చెందిన భూక్య గోపాల్ కుమార్తె రమను జయరాంతండాకు చెందిన లావుడ్యా శ్రీనుకు ఇచ్చి 2004లో వివాహం చేశారు. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అప్పటి వరకు బాగానే ఉన్న శ్రీను.. మద్యానికి అలవాటు పడి భార్యను అనుమానించి వేధింపులకు గురి చేసేవాడు. ఈ విషయం రమ తన తల్లిదండ్రులకు తెలుపగా పలు మార్లు పంచాయితీలు నిర్వహించారు. పెద్దల సమక్షంలో తన తప్పు ఒప్పుకుని, భార్యాపిల్లలను తీసుకుని వెళ్లేవాడు. అయినా శ్రీను ప్రవర్తనలో మార్పు లేదు. శ్రీను హింస భరించలేని రమ.. ఏప్రిల్ 22, 2016న వరంగల్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేసింది. ఈ క్రమంలో 2016, జూలై 1న చేనులో పత్తిగింజలు పెట్టడానికి వ్యవసాయ భూమి వద్దకు శ్రీను తన భార్యను తీసుకెళ్లాడు. మరుసటి రోజు కూడా పని ఉందని చేను వద్దకు తీసుకెళ్లాడు. 201 6, జూలై 2న మధ్యాహ్నం 3 గంటలకు జయరాంతండాకు చెందిన ఓ వ్యక్తి ఫోన్ చేసి రమపై శ్రీను కిరోసిన్ పోసి అంటించాడని చెప్పగా రమ తల్లిదండ్రులు కూతురు ఇంటికి వెళ్లారు. అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం తరలించారు. జరిగిన విషయం కూతురు రమను అడగగా కిరోసిన్ పోసి అంటించాడని తెలిపింది. చికిత్స పొందుతూ మూడు రోజుల తర్వాత రమ మృతి చెందింది. మృతురాలి తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో సాక్ష్యాధారాలను పరి శీలించిన కోర్టు.. నేరం రుజువుకావడంతో నేరస్తుడు లావుడ్యా శ్రీనుకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలాగీతాంబ తీర్పు వెల్లడించారు. కేసును ఏసీపీ ఆదినారాయణ, సీఐ సూర్యప్రకాశ్ పరిశోధించగా ఎస్సై వెంకటస్వామి పర్యవేక్షణలో హెచ్‌సీ సోమునాయక్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

అద్దంకి దయాకర్‌కు సముచిత స్థానం కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

హన్మకొండ : తెలంగాణ ఉద్యమ నాయకుడు అద్దంకి దయాకర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలో జాతీయ మాల మహానాడు వరంగల్, హనుమకొండ జిల్లాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేసిన ఉద్యమ నాయకుడు అద్దంకి దయాకర్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కేయూ పాలక మండలిలో మాల సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక భూమిక పోషించిన మాలలకు నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జాతీయ మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నే బాబురావు, కార్యదర్శి అశోద భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మేడి అంజయ్య, వెన్న రాజు, మాల సాంస్కృతిక విభాగం కన్వీనర్ ఎలుక దేవయ్య, రాష్ట్ర కార్యదర్శి సాంబయ్య, జై భీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ అసాది పురుషోత్తం, వరంగల్ మహా నగర అధ్యక్షుడు అంకేశ్వరపు రామచందర్, నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీకి ఏర్పాట్లు పూర్తి..

- రేపటి నుంచి ఆగస్టు 5 వరకు పరీక్ష
- ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఐదు కేంద్రాలు
- 27,741మంది అభ్యర్థులు
- నిర్దేశించిన సమయానికి 10 నిమిషాల ముందుగానే గేట్లు మూసివేత

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల నియామకానికి టీజీడీఎస్సీ పరీక్ష నిర్వహించేందుకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 18 నుంచి(రేపటి) ఆగస్టు 5వ తేదీ వరకు ఈ పరీక్ష నిర్వహించబోతున్నారు. రోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. ఇప్పటికే అభ్యర్థులకు సంబంధిత వెబ్‌సైట్ హాల్‌టికెట్లను కూడా అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో ఐదు పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌పద్ధతిలో కంప్యూటర్ బేస్డ్(సీబీటీ) పరీక్ష నిర్వహించబోతున్నారు. ఐదు పరీక్షకేంద్రాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని జయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌టెక్నాలజీ అండ్ సైన్స్, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కిషన్ పుర, హసన్‌పర్తిలోని నోబుల్‌టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్, హసన్‌పర్తి ఎర్రగట్టుగుట్టవద్ద ఉన్న అయాన్ డిజిటల్ జోన్, భీమారం సమీపంలోని పొద్దుటూరి గార్డెన్ దగ్గరలోని మోక్షిత కంప్యూటర్స్ పరీక్ష కేంద్రాలుగా ఉన్నాయి. ప్రతీ పరీక్ష కేంద్రానికి ఒక్కో అబ్జర్వర్‌ను నియమించారు. పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించి పరిశీలించనున్నారు.13 రోజులపాటు రోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. రోజూ ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే పరీక్షలకు అభ్యర్థులు రెండుగంటల ముందునుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిర్దేశించిన పరీక్ష సమయం ఉదయం 9 గంటలుకాగా 10 నిమిషాలు ముందుగానే ఉదయం 8.50 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారు. ఆ తరువాత అభ్యర్థులకు లోపలికి అనుమతించరు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరిగే పరీక్షలకు కూడా రెండు గంటల ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సింటుంది. మధ్యాహ్నం 01.50 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారు. ఆ తరువాత వచ్చేవారిని లోపలికి అనుమతించరు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లాక బయోమెట్రిక్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తమ హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును (ఐడింటీటీకార్డును) తీసుకుని రావాల్సింటుంది. ఐదుపరీక్ష కేంద్రాల్లో కలిపి మొత్తం 27,741మంది అభ్యర్థులు టీజీడీఎస్సీని రాయబోతున్నారు. స్కూల్ అసిస్టెంట్లు నియామకానికి ఎస్‌జీటీ తత్సమాన కేడర్‌లో టీచర్ల నియామకానికి ఈడీఎస్సీ నిర్వహించబోతున్నారు.పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దు. రాష్ట్రంలో మొత్తం 2.79 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలు రాయబోతున్నారు.

వ్యవసాయ అనుబంధ రుణాలు పెంచాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రవీందర్ రావు

హన్మకొండ : బ్యాంకులు వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలకు రుణాలు పెంచాలని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు సూచించారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) ఆధ్వర్యంలో వాణిజ్య, గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల బ్రాంచ్‌ల అధికారుల జోనల్ వర్క్ షాప్ ఆన్ బిజినెస్ అపార్చునిటీస్ ఫామ్ సెక్టార్, నాన్ ఫామ్ సెక్టార్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును రవీందర్ రావు ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి నాబార్డు రూ.460 కోట్లు రుణాలు మంజూరు చేసిందన్నారు. నాబార్డు జీఎం ఉష మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలను ప్రోత్సహించడానికి నాబార్డు రాయితీ అందిస్తోందన్నారు. డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వజీర్ సుల్తాన్, ఫౌల్ట్రీ ఫామ్స్ అధ్యక్షుడు ధర్మారావు, నాబార్డు డీడీఎం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.